# దాహం

పుల్లయ్య గారి మూడంతస్తుల మేడలో దీపాలు వెలుగుతున్నాయి. గదిలో దీపం వుంది కానీ మనిషి లేడు. మూడంతస్తుల మేడకీ, మూడు లక్షల ఆస్తికీ అధికారి అయిన పుల్లయ్యకి భార్య భాగ్యలక్ష్మి. ఆవిడకి ఒకే ఒక కూతురు-పదిహేను యేళ్ళు వచ్చాయియిప్పటికి. ఇంటర్ చదువుతోంది. కూతురికి పుల్లయ్య యెన్నో పేర్లు వెతికి 'సామ్రాజ్య లక్ష్మి' అని పేరు పెట్టుకున్నాడు. భార్య సామ్రాజ్యం అని కూతురిని పిలిచినా పుల్లయ్య మాత్రం పూర్తి పేరుతోనే పిలుస్తాడు. సామ్రాజ్య లక్ష్మి శ్రీమంతుల పిల్ల అయినా చదువుకుంటోంది. ఫస్ట్ మార్కు తెచ్చుకుంటూ స్నేహితులతో కల్సి మెల్సి వుంటుంది. నల్లగా పొట్టిగా అచ్చం తండ్రిలా వుంటుంది. అంటారు చూసిన అందరూ. తనెలా వుంటుందో తనకి తెల్సు. అందుకు బాధపడదు సామ్రాజ్యం డబ్బు చేతినిండా వుంది కనుక అందమైన లంగాలూ, వోణీలూ కొనుక్కుని అలంకరించుకుని కాలేజీకి వెళ్లి వస్తూ వుంటుంది. ఆటలన్నా, పాటలన్నా, సినిమాలన్నా చాలా యిష్టం. ఎదురింట్లో వున్న స్కూలు మాష్టారి పిల్లలతో స్నేహితంచేస్తూంటే తండ్రి చూసి కేకలు వేశాడు.

"వాళ్ళతో నీకు స్నేహితం యేమిటమ్మా?" అన్నాడు.

"వాళ్ళకేం నాన్నా! మనుషులు కారా? యెదురుప్రశ్న వేసింది.

"మనుషులే, అయినా మన అంతస్తుకి తగరు."

"స్నేహానికి అంతుస్తులెందుకూ?"

"నువ్వు, స్కూల్లో పాఠాలు చదువుతున్నావా? లేక యిలాంటి మాటలు నేర్చు, కుంటున్నావా?"

'రెండూనూ! అయినా నాన్నా, మనకి ఇదివరకు డబ్బు ఏమంత లేదుటగా?'

"ఔను , కానీ మూడు తరాలకి సరిపడ సంపాదించాగా! ఇప్పుడు ఉన్న వాళ్ళమే."ఇంత డబ్బు ఏం చేసుకుంటాం నాన్నా?"

"దానం చేసేస్తావా యేమిటి?" కోపంతో పళ్ళు కొరికాడు పుల్లయ్య.

"అంతా చెయ్యనుగానీ ఎదురింటి మాస్టారమ్మాయికి కాలేజీ ఫీజు కట్టేందుకు డబ్బులేదుట. చదువు మానేస్తానంటోంది. నాన్న! ఆ జీతం నువ్వు కట్టకూడదూ?"

"ఒసే భాగ్యం!" కూతురికి జవాబు చెప్పకుండా భార్యని కేకేశాడు. భాగ్యలక్ష్మి వచ్చింది. "ఏమిటండీ?" అంది.

"నీ కూతురికి మతి పోగొడుతున్నారు స్నేహితులు. కాస్త జాగర్తగా చూసుకో!"

'పుల్లయ్యగారూ' అని ఎవరో పిలవటంతో ఆయన అక్కడ నుండి బైటకి వెళ్లిపోయాడు.

"ఏమైందే?" కూతుర్ని అడిగింది.

"ఏమీ కాలేదు" రుసరుసలాడుతూ వెళ్లిపోయింది సామ్రాజ్యం.

"ఏమిటీ!" ఆ తండ్రి ఈ కూతురూ? ఒకళ్ళ అభిప్రాయాలు ఒకళ్ళకి కలవవు'

"అమ్మా! ఫ్రెండ్స్ అందరం కలిసి సినిమాకి పోతున్నాం. రాత్రి తొమ్మిదింటికి భీముడిని పంపు సినిమాహాలు దగ్గరకి."

"వద్దమ్మా! నాన్న నిన్ను తిరగనీయొద్దు అన్నారు."

"ఏం ఫర్లేదు. నన్నేం పిల్లి ఎత్తుకు పోదు" విసవిసా వెళ్ళి పోయింది సామ్రాజ్యం.

భాగ్యలక్ష్మి నిట్టూర్చింది. సంధ్యవేళ అయిందని పనిమనిషి ప్రతి గదిలోనూ లైటు వేసింది. 'వుండేది ముగ్గురం. ఇంత యిల్లు ఎందుకు?' అనుకుంది. మెల్లగాలేచి వెళ్ళి మెత్తటి పరుపు మీద పడుకుంది.

ఆవిడకి తన చిన్నతనం గుర్తుకి వచ్చేస్తుంది. అప్పుడు జరిగిన ప్రతి సంఘటనా యిప్పుడే జరిగినంత స్పష్టంగా కళ్ళముందు మెదులుతుంది..అవన్నీ గుర్తు చేసుకోవటం కూడా ఓ సరదాగా వుంటుంది భాగ్యలక్ష్మికి. జీవితం ఎంత విచిత్రమైంది.

ఆ రోజుల్లో అన్నానికి బట్టకి కూడా కటకటగా వుండేది. తల్లి దండ్రులకి ఆరో సంతానంగా పుట్టిఅనామకురాలిగా పెరిగింది. కొడుకులు పెద్దవాళ్ళు కావటం. తల్లి

దండ్రులు ముసలివాళ్ళు కావటంతో ఇంట్లో స్థానాలు మార్పు చెందాయి. అన్నా వదినల యీసడింపులు ఎక్కువ అయినాయి. తల్లిదండ్రులు సంపాదించలేని స్థితిలో భాగ్యలక్ష్మికి పెళ్ళీడు వచ్చింది.

"అబ్బాయి! చెల్లెలికి యేదైనా సంబంధం చూడరా!" కొడుకుకి చెప్పింది తల్లి.

"డబ్బుందా? వుంటే చెప్పు చూస్తాను."

"నీకు తెలియని డబ్బు మా దగ్గరెక్కడుందిరా?"

"మరి నాదగ్గరెక్కడుందమ్మా? ఈ ఇల్లు గడపటానికే చస్తుంటే!" విసుక్కున్నాడు.

"దీనికి పెళ్లి రాతలేదు. పదేళ్ళప్పుడు వచ్చిన జ్వరంలో చావకుండా బ్రతికి నాకు శాంతిలేకుండా చేస్తోంది," అని లబలబలాడేది. ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరికీ చెప్పేది- మా అమ్మాయికి వరుడిని చూసిపెట్టండని.

అమ్మ బాధని అర్థం చేసుకున్న ఓ ముసలాయన ఓసారి పెళ్ళి సంబంధం వుంది అంటూ వివరాలు చెప్పాడు. పెళ్ళి కొడుకు వివరాలు అనేసరికి తనూ తలుపు చాటున నిల్చింది.

"పుల్లయ్యకేం బంగారం లాంటిమనిషి. అయిదడుగుల ఎత్తే అయినా ఆరోగ్యంగా వుంటాడు. పైమీద బట్ట తప్ప మరే ఆస్తీ లేనివాడు మావూరొచ్చి వడ్డీ వ్యాపారం అంటూ మొదలెట్టి అలా అలా పెంచేసుకున్నాడు ఆస్తిని. ఇప్పుడు నిజం చెప్పాలంటే పదెకరాల పల్లం పొలం. పాతికవేలు వడ్డీకి తిరుగుతూన్న ఆస్తి. అయితే వయస్సు నలభై పైమాటే. ఇదివరలో యిద్దరు పెళ్లాలు వురెట్టుకొని చచ్చారట. తిని వుండలేక చచ్చి వుంటారు గానీ - నీ పిల్లనిస్తానంటే చూసుకోను వస్తాడు. నేవున్నది వున్నట్లు ముందే చెప్పాను. ఆ తర్వాత మీ యిష్టం!" అని క్షణం ఆగాడు ముసలాయన.

"నలభై ఏళ్లా! యిద్దరు పెళ్ళాలు వురెట్టుకు చస్తే మళ్ళీ తగుదునమ్మా అని మూడో పెళ్ళికి తయారైనాడా? ఛీ 'ఛీ'. అసహ్యంతో నిండింది మనస్సంతా. అమ్మ ముసలాయన్ని తిట్టి పంపేస్తుంది అనుకుంది. కానీ ఆవిడ అలా చెయ్యలేదు.

"వయస్సుదేంగానీ ఆయన్ని వచ్చి పిల్లని చూసుకోమను." నెత్తిన పిడుగు పడినట్టు అయిందీ మాటకి.

"మూడో పెళ్లి అని మర్చి పోవద్దు."

"బ్రతకటానికి ముఖ్యంగా కావల్సింది తిండీ, బట్టా! అవి పుష్కలంగా యివ్వగల ఏ మగాడి నైనాసరే ఆడది పెళ్లాడి తీరాల్సిందే! అందులోనూ యినాటి మా

ఈ స్థితిలో మరీ అవసరం. అయినా మా అమ్మాయి అందరిలాంటి పిల్ల కాదు. నామాట జవదాటదు. మీరతన్ని తీసుకురండి."

అమ్మ యిచ్చిన భరోసాకి ఆయనకి ధైర్యం వచ్చింది. అంతే, లేచి వెళ్ళాడు. 'నాకీ పెళ్ళి వద్దు' అని అమ్మతో, నాన్నతో చెప్పినా ఒక్కరూ విన్పించుకోలేదు. "అసలు యిదికుదిరిందా? అతని వచ్చి చూసి నచ్చింది అన్నప్పటి మాట కదా!" అని తేలిగ్గా తోసేశారు. అతను వచ్చాడు. చూశాడు నచ్చింది అన్నాడు. నాలుగు రోజుల్లో పెళ్లికి లగ్నాలు పెట్టించండి అన్నాడు. పెళ్ళికి ఖర్చుకిగాను ఈ రెండువేలూ వుంచండి అని యిచ్చాడు. చాలా సింపుల్‌గా అయిపోవాలి అన్నాడు. వెళ్ళి పోయాడు. యింక అమ్మసంతోషానికి అంతులేదు. నాన్న బాధని అణుచుకుంటూ పెళ్ళి పనుల్లో పడ్డారు. 'నాకీ పెళ్ళి వద్దు'', 'నాకీ పెళ్ళి వద్దు' అనే తన మాట ఎవరూ విన్పించుకోలేదు. పుల్లయ్య పెళ్లికూతురికి నగలూ, చీరెలూ అంటూ పంపాడు. అవి చూసే సరికి కళ్ళు తిరిగాయి. నోట్లోంచి మాట రాలేదు. పెళ్ళి అయిపోయింది.

చీరెలూ, నగలూ చూసుకుని మురిసి పోవటంలో 'నాకీ పెళ్ళి వద్దు' అన్నమాట, శోభనం గదిలోకి పంపిన రోజున పందిరి మంచం మీద కూర్చున్న పుల్లయ్యని చూసేసరికి గాని గుర్తు రాలేదు.

సమయం మించిపోయింది. ఆ మాట యిప్పుడన్నా అందరూ నవ్వుతారు. పిచ్చిది అని హేళన చేస్తారు. యివన్నీ ఆలోచించి ఆయన అంటే వున్న అసహ్యాన్ని మింగేసి. శరీరాన్ని అప్పగించి ఆ తర్వాత జీవితంతో రాజీపడి అత్తవారింట్లో కాలు పెట్టింది. తర్వాత భర్తకి మరీ కల్సివచ్చింది. పదేళ్ళలోనే ఆస్తి పదింతలు పెరిగింది. అమ్మాయి పుట్టింది. కూతుర్ని ప్రాణం కంటే మిన్నగా చూసుకుంటూ కాలాన్ని వెళ్ళదీస్తోంది.

సామ్రాజ్యానికి తన పెళ్ళిలా చెయ్యదు. అందమైన అబ్బాయిని చూసి పెళ్ళి చేసి ఇల్లరికం వుంచుకుంటుంది. దానికి పుట్టే పిల్లలైనా అందంగా వుంటే చూడాలని వుంది. భగవంతుడు యీకోరికైనా తీరుస్తాడో లేదో? పుల్లయ్య మాత్రం యిలాంటి ఆలోచనలేం లేకుండా హాయిగా బ్రతుకుతాడు. ఆయనకి తృప్తినీ, సంతోషాన్నీ యిచ్చేది డబ్బు. ఆ డబ్బుని యింకా యింకా పోగు చేసుకోవటానికే కాలాన్ని ఖర్చు చేస్తాడు. ఎంత వస్తున్నా ఆయన 'దాహం' తీరదు.

'యీయన యేం మనిషి? 'మరమనిషి!' తనలో తనే అనుకుని పళ్ళు కొరుక్కుంది.

"రేపు మన పెళ్ళి అయినరోజు! పట్టు చీరె తెచ్చాను. నేను వ్యాపారం గొడవలో పడి మర్చి పోయినా, నువ్వు మర్చిపోకు రాత్రికి ఆ పట్టు చీర కట్టుకో" అన్నమాట గుర్తుకి వచ్చింది. అంతే! ఆలోచనలుకట్టిపెట్టి పరుపు మీద నుంచి లేచింది. స్నానం చేసి పౌడరు రాసుకుని తలలో పువ్వులు పెట్టుకొని. భర్త తెచ్చిన చీర కట్టుకుని అద్దంలో చూసుకుంటూ నిల్చుంది. గోడగడియారం తొమ్మిది కొట్టింది. విసుగువచ్చి సోఫాలోకి వచ్చి కూర్చుంది. ఎంత సేపో గడచిన తర్వాత పుల్లయ్య వచ్చాడు.

"అప్పుడే నిద్ర ముఖమా?" కళ్ళు మూసుకు కూర్చున్న భార్య పక్కన వచ్చి కూలబడ్డాడు. బొడ్డున ఇనపెట్టె తాళం చెవులు బరువుగా వేలాడుతున్నాయి. చేతిలో యేదో వుంది.

అదేమిటో కూడా చూడాలని ఆసక్తి లేదు భాగ్యలక్ష్మికి. నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయింది.

"భాగ్యం! చీర చాలా బాగుంది కదూ!"

"వూఁ"

"అలా వున్నవేం?"

"ఏంలేదు."

"మన పెళ్లి అయి యివాళకి పద్దెనిమిదేళ్ళు, ఔనా"

"వూ"

"అంత త్వరగా తిరిగొచ్చాయి. కానీ నిన్ను చూస్తే యిప్పటికి కొత్త కొత్తగానే కన్పిస్తావు."

"భోజనం చేద్దామా?"

"అబ్బ! నీకెప్పుడూ ఆకలి గొడవే. నే యింత సంతోషంగా మాట్లాడుతుంటే, నువ్వు ఏమిటీ అలా జవాబు చెప్తావు? సరేగానీ యివాళ నీకు కొత్త ప్రెజంటేషన్ తెచ్చాను. తిరుగు, మెడలో నేనే పెడతాను."

భాగ్యలక్ష్మి యాంత్రికంగా వెనక్కి తిరిగింది. ఆయన కొత్త రకం నెక్లెస్ మెడలో పెట్టి, "చూసుకో, ఎంత బాగుందో? చూడూ యిప్పుడే వచ్చింది బేరం. మూడు కాసులది కొనేశాను," గర్వంగా నవ్వాడు పుల్లయ్య.

భాగ్యలక్ష్మిని నిలువుటద్దం ముందుకు తీసుకువెళ్ళి నిలబెట్టాడు. పక్కననిలబడ్డ భర్త ముఖంలోకి చూస్తూ మనస్సులో నించి వుబికి వచ్చే అసహ్యాన్ని దిగమింగుకుంటూ తన మెడ వైపుకు చూసుకుంది ఒక నిమిషం, రెండు నిమిషాలు, మొదట నిర్లిప్తంగా, తర్వాత పరీక్షగా, ఆ తర్వాత ఆదుర్దాగా చూసి చటుక్కున మెడలో నెక్లెస్ చేతిలోకి తీసి తిప్పి చూస్తూ కొక్కెం దగ్గర అడుగున వున్న పేరుని పైకి చదివింది.

"అయ్యో... యిది మన అమ్మాయిదండీ!" అని వెర్రికేక వేసింది.

"ఏమిటీ?" పుల్లయ్య పిచ్చిగా చూశాడు.

"యిది మన సామ్రాజ్యానిది. అది మనసు పడిపోయిందని మీకు చెప్పకుండా కొన్నాను. యిది పెట్టుకొని యివాళ సినిమాకెళ్లింది. అన్నట్లు పిల్ల యింకా రాలేదేం? బాబోయ్! నా బిడ్డ ఏమైంది? నా తల్లి ఏమైంది? భీముడిని సినిమా హాలుకి పంపానే'" అంటూ ఏడుస్తోంది భాగ్యలక్ష్మి. పుల్లయ్య వళ్ళంతా చెమట పట్టేసింది. తలుపు తెరుచుకుని కిందకి వచ్చాడు.

సామ్రాజ్యం కోసం వెళ్ళిన భీముడు "అయ్మాయిగారు సినిమా హాలు దగ్గర కనిపించలేదండీ!" అంటూ వచ్చాడు.

"ఏమైనట్లు? దాని స్నేహితులెవరూ కనిపించలేదా?"

"కనిపించారండీ! ఆట సగంలో వుండగానే తల నొప్పిగా వుంది. యింటికెడతానని బైటకి ఒచ్చేసినాదంట."

"ఒక్కర్తేనా?"

"ఔనండి!"

"అయ్యో! యేదో కొంప మునిగింది." భాగ్యలక్ష్మి గుండెలు బాదుకుంది. పుల్లయ్యా, భీముడూ వెతకటానికి వెళ్ళాడు. సామ్రాజ్యం యెక్కడా కప్పించలేదు. తిరిగి వచ్చారు. "అయ్యో! పోలీస్ రిపోర్టన్నా యివ్వండీ! నా బిడ్డని వెతికి నా కివ్వండీ!" ఏడుస్తోంది భాగ్యలక్ష్మి.

పుల్లయ్య ఫోను దగ్గరకి నడిచాడు. ఫోను తీయిబోయిఆగిపోయాడు.

"వద్దు. పోలీసులకి రిపోర్ట్ వద్దు. నేనే మళ్ళీ వెళ్ళి వెతుక్కు వస్తాను."

" ఆ గొలుసు మీ దగ్గరకి తెచ్చినవాడిని పట్టుకుని అడగండీ!"

"చూశాను. ఆ వెధవ దొరకలేదు."

"మరెలాగండీ! గొలుసుపోతే పోనీ. వయసులో వున్న ఆడపిల్లండీ! అసలే కాలం బాగా లేదండీ. రౌడీ వెధవలకి దయాదాక్షిణ్యం వుండదండీ!"

"భాగ్యం!నాకవన్నీ తెల్సు. భీముడూ రా పోదాం." అని పుల్లయ్య బయలుదేరాడు.

పుల్లయ్య ప్రహరీ గేటు దాటబోతుండగా పోలీసు వ్యానువచ్చి ఆగింది. పుల్లయ్య కాళ్లు వణికాయి.

"మీ అమ్మాయి"... మీ అమ్మాయి...."

"అవును మా అమ్మాయి రాత్రి సినిమాకంటూ వెళ్ళింది. తిరిగి రాలేదు. దాని కోసమే వెతుకుతున్నాం. మీకు రిపోర్టు యివ్వాలని వస్తున్నాను. కన్పించిందా? చెప్పండి... త్వరగా చెప్పండి.

"కన్పించింది."

"ఎక్కడ?"

"సినిమా నుండి ఇంటికి రావాలని ఆటో యెక్కిందట. ఆటోలో ఇద్దరబ్బాయి లున్నారట. వాళ్ళు దారి తప్పించేశారట. వూరికి దూరంగా వున్న తోటలో స్పృహలేని స్థితిలో యెవరో చూసి మాకు ఫోన్ చేశారు. హాస్పటల్‌లో చేర్చాం. రండి,"

పుల్లయ్య నెత్తిన పిడుగులు పడినట్లు అన్పిస్తోంది. నోట మాట రావటంలేదు. భీముడు పరుగున వెళ్ళి భాగ్యలక్ష్మిని తీసుకువచ్చాడు. భాగ్యలక్ష్మి వెక్కివెక్కి యేడుస్తోంది. కారు హాస్పిటల్ ముందు ఆగింది. పరుగున లోపలికి నడిచారు. సామ్రాజ్యం వళ్లు తెలియని స్థితిలో వుంది. భార్యాభర్త లిద్దరూ కూతుర్ని చూసుకుంటూ నిల్చుండిపోయారు. భాగ్యలక్ష్మి "సామ్రాజ్యం" అని బావురుమంది.

"పుల్లయ్యగారూ!".. పుల్లయ్య తలెత్తి చూశాడు. యెదురుగా పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నిల్చుని వున్నాడు. అతని వెనక పోలీసులు నిల్చుని వున్నారు.

"మీ అమ్మాయి తన గొలుసు పోయిందని రిపోర్టు యిచ్చింది."

పుల్లయ్య గజగజలాడాడు.

"దాన్ని దొంగిలించినవాడిని పట్టుకున్నాం. కాని నెక్లెస్ అతని దగ్గర లేదు. అది మీ యింట్లో దొరికింది.అదొక్కటే కాదు. మరెన్నోదొంగిలించిన వస్తువులు మీ యింట్లో దొరికాయి. మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాం."

భాగ్యలక్ష్మి వెర్రిదానిలా చూసింది.

అంతే! 'అయ్యో' అని పెద్ద కేక పెట్టి విరుచుకు పడిపోయింది.

తల్లి కేకకి సామ్రాజ్యం మెల్లగా కళ్ళు తెరిచింది. పోలీసుల మధ్య తండ్రి బేడీలతో నడిచి వెళ్ళటం కన్పించింది. "నాన్నా!" అని గావుకేక వేసింది. పుల్లయ్య ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు. అంతే! తల తిప్పేసుకొని ముందుకు నడుస్తున్నాడు.

"దాహం- ధన దాహం. యిది తీరని దాహం." అంతరాంతరాల్లో లేచి యేదో ప్రాణి గొంతెత్తి అరుస్తూన్నట్లుంది. యీ అంతర్వాణి చాలా సంవత్సరాల నుంచి చాలా హెచ్చరిస్తూ వుండేది.

దాని గోల తను విన్పించుకోలేదు. పైగా నోరు నొక్కి పారేశాడు. కానీ మళ్ళీ యిప్పుడు అంతర్వాణి చెప్తూంది.

"తీరనిదియే దాహానికైనా పర్యవసానం యిలానే వుంటుంది.

నీ ధన దాహానికి ఎన్నో కుటుంబాలు విలపించాయి. యిప్పుడు నువ్వు విలపిస్తున్నావు. నీ ప్రాణానికి ప్రాణం అయిన కూతురి శీలం కొల్లగొట్టిన ఆ కిరాతకుడూ నీలాంటివాడే. వాడికి స్త్రీ దాహం. నీకు ధన దాహం...."

పుల్లయ్య చెవులు పోటెత్తేలా ఈ మాటలు విన్పిస్తున్నట్లున్నాయి. అడుగు తీసి అడుగు వేసేంత శక్తి కూడా లేని వాడిలా నడుస్తూ బైట నిలబడి వున్న పోలీస్‌వాన్ యెక్కాడు. భాగ్యలక్ష్మి యేడుపు దూరమై పోయింది.

(విజయ)